పల్లె ముంగిట్లో వైద్య సేవలు



మజ్జివలస విలేజ్ క్లినిక్‌లో సేవలు అందిస్తున్న వైద్యుడు ఏబీ మల్లికార్జునరావు



దాకమర్రిలో రక్తపోటు పరీక్ష చేస్తున్న సిబ్బంది



లక్ష్మీపురం స్కూల్‌లో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కలిగిస్తున్న వైద్యురాలు శోభారాణి

- ప్రతీ 2 వేల మందికో విలేజ్ క్లినిక్
- గతంలో 60 వేల మందికో పీహెచ్‌సీయే దిక్కు
- 'ఫ్యామిలీ డాక్టర్'తో పేద రోగులకు మేలు

తగరపువలస: వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల రాకతో గ్రామీణుల ముంగిట్లోకి వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. నెలలో రెండుసార్లు పీహెచ్‌సీ వైద్యుడు, వైద్య సిబ్బంది, 104 వాహనంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా పంచాయతీల్లో ఉండి ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా అక్కడి ప్రజలకు తనిఖీలు, రక్తపరీక్షలు చేసి, సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు పరీక్షలు చేసి అవసరమైన వారికి వ్యాక్సినేషన్ అందిస్తున్నారు. వీటితోపాటు మధుమేహం, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, మలేరియా, క్షయ, కుష్టు, టైఫాయిడ్, డెంగ్యూ, రక్తపోటు పరీక్షలు జరిపి మందులు, ఉపకరణాలు అందిస్తున్నారు. ఈ విలేజ్ క్లినిక్‌లలో 12 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలతోపాటు 105 రకాల మందులు అందుబాటులో ఉంటున్నాయి. మధ్యాహ్నం వేళ అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆరోగ్యంపై అవగాహన కలిగిస్తున్నారు. తర్వాత దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వారిని పరామర్శించి చికిత్స, మందులు అందిస్తున్నారు. గతంలో మండలానికో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండేది. ఇవి మండలంలో అన్ని పంచాయతీలకు అందుబాటులో ఉండేవి కాదు. ఇక పంచాయతీల్లో ఏఎన్ఎం సబ్ సెంటర్లు ఉన్నా అక్కడ సిబ్బంది, వసతి, మందుల కొరత ఉండేది. దీంతో గ్రామీణులకు చిన్నపాటి జ్వరం వచ్చినా గ్రామీణ వైద్యులు లేదా పట్టణాల్లోని ప్రైవేటు ఆస్పత్రులకు తరలివెళ్లేవారు.

వైద్యానికి పక్క జిల్లాకే...

భీమిలి మండలంలోని తాళ్లవలస, పద్మనాభం మండలం రేవిడి పీహెచ్‌సీలు మండల ప్రజలకు దూరంగా ఉండేవి. వీటికంటే విజయనగరం పట్టణమే దగ్గరగా ఉండడంతో ఈ రెండు మండలాల ప్రజలు పీహెచ్‌సీల కంటే విజయనగరంలోని ఆస్పత్రులకు వెళ్లేవారు. అలాగే ఆనందపురం పీహెచ్‌సీ కూడా మండలానికి ఒక్కవైపే ఉండడంతో ఈ మండలం ప్రజలు విశాఖలోని ఆస్పత్రులకు వెళ్లేవారు. అంటే ప్రతి మండలంలో 60 వేల నుంచి 75 వేల జనాభాకు ఒక్క పీహెచ్‌సీయే ఆధారంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రతి పంచాయతీ పరిధిలో ఒక విలేజ్ క్లినిక్ ఉండడంతో 2 వేల మందికి ఒక క్లినిక్‌తో వైద్యం ఇంటి ముంగిట్లోనే అందుతోంది. ప్రతి విలేజ్ క్లినిక్‌లో రోజుకు 60 వరకు ఓపీ నమోదవుతోంది. 2022 అక్టోబర్‌లో ప్రారంభమైన ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా భీమిలి డివిజన్‌లో మూడు పీహెచ్‌సీ పరిధిలో ఇప్పటి వరకు 1,10,990 ఓపీలు నమోదయ్యాయి. వీటిలో భీమిలి మండలంలో 19,356, ఆనందపురంలో, 15,630, పద్మనాభంలో 76,004 ఉన్నాయి.

ఇంటికే వైద్యురాలు వస్తున్నారు



నాకు ఇటీవల పక్షవాతం రావడంతో ఇంటి వద్దే ఉంటూ ఫిజియోథెరపీ చేయించుకుంటున్నాను. ఆశా కార్యకర్త అప్పడమ్మ సాయంతో వైద్యురాలు శోభారాణి, సిబ్బంది వచ్చి మందులు, సూచనలు అందిస్తున్నారు. గతంలో వైద్యం కోసం విశాఖ, విజయనగరం వెళ్లేవాళ్లం.

– గడిదీసు అచ్చియ్యమ్మ, దాకమర్రి

వైద్యం కోసం జొన్నాడ వెళ్లేవాళ్లం



గతంలో మా పంచాయతీలో ఎవరికైనా చిన్నపాటి అనారోగ్య సమస్యలు తలెత్తినా విజయనగరం జిల్లాలోని జొన్నాడ గ్రామీణ వైద్యుల వద్దకు వెళ్లేవాళ్లం. మాకు భీమిలి, తగరపువలస కంటే జొన్నాడే దగ్గర. అక్కడ మందులు, పరీక్షలకు కలిపి డబ్బులు తీసుకునేవారు. ఇప్పుడు మా వద్దకే వైద్య సిబ్బంది వచ్చి ఉచితంగా సేవలు అందిస్తున్నారు.

– మొకర అప్పలనరసయ్య, దాకమర్రి

క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

పద్మావతి అమ్మవారికి పూజలు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీ పద్మావతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్తరా నక్షత్రం కావడంతో అభిషేకాలు చేశారు. టీటీడీ అర్చకులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

అందుబాటులో ప్రకృతి వ్యవసాయ ఎరువులు



కోరాడలో ఏర్పాటు చేసిన ఎన్‌పీఎం షాపు

పద్మనాభం: రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలనుకుంటే అవసరమైన ఎరువులు, కషాయాలు అందుబాటులో ఉంచినట్టు ఎస్ఎఫ్ఏ చక్రవర్తి సూచించారు. మండలంలోని కోరాడ, సామయ్యవలస గ్రామాల్లో ఆదివారం ప్రకృతి వ్యవసాయం, ఎరువులు, కషాయాల షాపులను ప్రారంభించారు. మీనామృతం తయారీ, కిచెన్ గార్డెన్ ఏర్పాటుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి ఎం.అప్పలనాయుడు, జైరాం, కాంతారావు, దొంతల శ్రీను పాల్గొన్నారు.

ఆటో టైరు చోరీ

తగరపువలస: స్థానిక మెయిన్‌రోడ్డు పక్కన నిలిపిన ఆటో టైరును శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విప్పుకుపోయారు. మార్కెట్ రోడ్డులో ఆటోను పార్కింగ్ చేసిన దాని యజమాని బి.గణేష్ ఆదివారం ఉదయం వచ్చి చూసే సరికి ముందు టైరు కనిపించలేదు. మూడు మాసాల క్రితం ఇదే ఆటో బ్యాటరీని దొంగలు అపహరించుకుపోయారని బాధితుడు వాపోయాడు. భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో చిల్లర దొంగలు పెరిగిపోయి ఇంటి ముందు పార్కింగ్ చేసిన వాహనాల నుంచి టైర్లు, విడి భాగాలు, పెట్రోల్ వంటివి తరచూ చోరీ చేస్తున్నారని బాధితుడు తెలిపారు. ఇలాంటి వాటిపై పోలీసులు నిఘా ఉంచాలని కోరాడు.

బాలగంగాధర్ తిలక్‌కు నివాళి



సర్టిఫికెట్లతో విద్యార్థులు, మండలి ప్రతినిధులు

తగరపువలస: స్వరాజ్యం నా జన్మ హక్కు అని ఎలుగెత్తి చాటిన ఉద్యమ సంఘ సంస్కర్త బాల గంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా ఆదివారం ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ప్రతినిధులు, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా సూకరాజు మాట్లాడుతూ తిలక్ గొప్పదనాన్ని వివరించారు. అనంతరం గత ఫిబ్రవరిలో పరీక్షలు రాసి పాసైన హయ్యర్, లోయర్ విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

అవినీతికి ఆస్కారం లేకుండా పథకాలు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పీఎం పాలెం : అవినీతికి ఆస్కారం లేకుండా అర్హతే ప్రామాణికంగా దేశంలో సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 6వ వార్డు పీఎంపాలెం హౌసింగ్ బోర్డు కాలనీ 50వ నంబరు సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి స్థానికులతో మాట్లాడారు. ఈ క్రమంలో ఎ.వరలక్ష్మి అనే మహిళకు ప్రభుత్వం ద్వారా రూ.9.69 లక్షల ఆర్థిక ప్రయోజనం లభించిందని వివరించారు. ఈ సందర్భంగా ఆమెను ఎమ్మెల్యే అభినందించారు. ఎవరైనా అర్హులకు పథకాలు అందకపోతే వారి దరఖాస్తులు పరిశీలించి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

రూ.3.5 కోట్లతో అభివృద్ధి పనులు

క్రికెట్ స్టేడియంకు సమీపంలో ఉన్న ఏఎస్సార్ నగర్ పరిధిలో సుమారు రూ.3.5 కోట్లతో రహదారులు, డ్రైనేజీలు నిర్మించామని ఎమ్మెల్యే శ్రీనివాసరావు వివరించారు. టీడీపీ పాలనలో కాలనీలో కనీస రోడ్డు సదుపాయం లేదని, ఈ నాలుగేళ్లలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును గెలిపించుకుంటామని స్థానికులు ముక్తకంఠంతో చెప్పారు. గతం ప్రభుత్వం కేవలం శిలాఫలకాలకు మాత్రమే పరిమితమైందని, కాలనీ అభివృద్ధిని పట్టించుకోలేదని స్థానికులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కనక మహాలక్ష్మి, రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, వైఎస్సార్ సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి మహేష్, సీనియర్ నాయకుడు గాదె రోశిరెడ్డి, 5, 6, 7, వార్డుల అధ్యక్షులు పోతిన హనుమంతరావు, బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, నాయకులు కె.వరలక్ష్మి, పిళ్లా సత్యనారాయణ, సియ్యాద్రి కనకరాజు, పోతిన ప్రసాదు, సూరిబాబు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్‌లో 5 వేల మొక్కల ఏర్పాటు



సాగర్‌నగర్‌లో మొక్కలు నాటుతున్న సిబ్బంది

కొమ్మాది: పర్యావరణ పరిరక్షణలో భాగంగా పచ్చదనంపై అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఇందులో భాగంగా రుషికొండ, ఎండాడ, సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం ప్రాంతాల్లో రోడ్ల డివైడర్ల మధ్యలో మొక్కలు నాటే పనులను జీవీఎంసీ అధికారులు వేగవంతం చేశారు. ఇప్పటికే నగరంలో అనేక చోట్ల పార్కుల అభివృద్ధి, సుందరీకరణ పనులు పూర్తి స్థాయిలో జరుగుతున్నాయి. అదేవిధంగా ఈ రోడ్డు వెంబడి శనివారం, ఆదివారం సుమారు 5 వేల మొక్కలు నాటారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

తగరపువలస: త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుడు రచించిన ఆధ్యాత్మిక గ్రంథాలపై ఆయన శిష్యులు ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. భీమిలి, చిట్టివలస, మధురవాడ, మారికవలస ప్రాంతాల్లో సమితి సభ్యుడు రావణ అక్షయ్ మాట్లాడారు. సర్వ జీవరాశులను సృష్టించిన భగవంతుడు ఒక్కడేనన్నారు. బాలకృష్ణ, ఆదమ్మ, అప్పలనరసమ్మ, సర్వధారి, అవినాష్ పాల్గొన్నారు.

తీరంలో అలల ఉధృతి



సాగర్‌నగర్ గెడ్డను తాకుతున్న కెరటాలు

కొమ్మాది: తీరంలో అలల తాకిడి ఉధృతంగా ఉంది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు తీరంలో కెరటాలు పెద్ద ఎత్తున ఎగసి పడుతున్నాయి. ఇప్పటికే మత్స్యకారులు పడవలు, బోట్లు, వలలు, సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇదిలా ఉండగా సముద్రం భీమిలి జగ్గారావు తోట వద్ద, మంగమారిపేట బేవాచ్ పార్కు వద్ద, సాగర్ నగర్ బీచ్ గెడ్డ వద్ద ముందుకు వచ్చింది. తీరం కోతకు గురి కావడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

దంచికొట్టిన వర్షం



మిథిలాపురి వుడా కాలనీ సర్వీసు రోడ్డులో నిలిచిన వర్షం నీరు



సాగర్‌నగర్ రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

కొమ్మాది: భీమిలి, ఉప్పాడ, ఎండాడ, రుషికొండ, సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం ప్రాంతాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మోస్తారు వర్షం కురవగా సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులు, భారీ వర్షం పడడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. భీమిలి బీచ్ రోడ్డు, రుషికొండ, సాగర్ నగర్ రోడ్లు చెరువును తలపించాయి. ఒక్కసారిగా రోడ్డుపై వరద ప్రవాహం భారీగా రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో సాగర్‌నగర్ ఇస్కాన్ సమీపంలో, ఎండాడ అంధుల పాఠశాల సమీపంలో రోడ్డుపైకి వరద నీరు చేరడంతో కిలోమీటరు మేర ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అదేవిధంగా మూడు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అదేవిధంగా సాగర్‌నగర్ కల్వర్ట్ వద్ద వర్షానికి రక్షణ గోడ కూలిపోయింది. జీవీఎంసీ 4వ వార్డు పరదేశిపాలెం గెడ్డ ఒక్కసారిగా పొంగిపోవడంతో అటుగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకులు చిక్కుకుపోయారు. గమనించిన స్థానిక యువకులు తాళ్ల సహాయంతో రక్షించారు. గెడ్డ పొంగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

మధురవాడలో భారీ వర్షం

మధురవాడ: మధురవాడ పరిసర ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఇప్పటికే అప్పుడప్పుడు కురిసిన వర్షాలకు ఈ వర్షం తోడు కావడంతో నగర వాసులు సేద తీరారు. జాతీయ రహదారిపై మధురవాడ అప్ బ్రిడ్జి, చంద్రంపాలెం, వుడా కాలనీ జంక్షన్, కార్‌షెడ్ పరిసర ప్రాంతాలతోపాటు ఇతర లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు.

సుధాకరరెడ్డి మృతికి సంతాపం



భీమునిపట్నం: భీమిలికి చెందిన ప్రముఖ వైద్యుడు దాడిరెడ్డి సుధాకర రెడ్డి (79) ఆదివారం సాయంత్రం కన్నుమూశారు. గత 40 సంవత్సరాలుగా ఆయన ఇక్కడ వైద్య సేవలు అందించి మంచి పేరు పొందారు. అలాగే 1995 నుంచి 2000 వరకు మున్సిపల్ కౌన్సిల్‌లో కో ఆప్షన్ సభ్యులుగా ఉన్నారు. ఆయన కుమారుడు డి.శైలేంద్రరెడ్డి 2001 నుంచి 2005 వరకు మున్సిపల్ చైర్మన్‌గా పని చేశారు. కొంత కాలంగా సుధాకర రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ చనిపోవడంతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. ఆయన మృతి తీరని లోటని, ఆయన సేవలను మరిచిపోలేమని అన్నారు.


క్రాస్‌బౌ చాంపియన్‌షిప్‌లో నసీర్ ప్రతిభ



బంగారు పతకాలు సాధించిన నసీర్ ఆలీ

తగరపువలస: ఆగ్రాలో ఈ నెల 21, 22 తేదీల్లో జరిగిన నాలుగో జాతీయస్థాయి క్రాస్‌బౌ చాంపియన్‌షిప్‌లో ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ 10వ తరగతి విద్యార్థి నసీర్ ఆలీ ప్రతిభ చూపాడు. జాతీయ స్థాయి ఇండియన్ క్రాస్ బౌ షూటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలతో పాటు బెంజ్ రెస్ట్ ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో బంగారు పతకాలు సాధించాడు. నసీర్ ఆలీ ఎంవీపీ కాలనీలోని భారత్ షూటింగ్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. పతకాలు సాధించిన ఆలీని కుటుంబ సభ్యులు అబ్బాస్ ఆలీ, సుఖీభవ హుస్సేన్, స్కూల్ డైరెక్టర్ అమిత్‌జైన్ , ప్రిన్సిపాల్ భమిడిపాటి శైలజ అభినందించారు.

వైఎస్సార్ సీపీ గెలుపునకు ఐక్యంగా పనిచేద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ 2వ వార్డు ఇన్‌చార్జి కరుణాకర రెడ్డి

తగరపువలస: వైఎస్సార్ సీపీ తరపున అంతా ఒకే మాటపై ఉండి వచ్చే 2024 ఎన్నికలలో కలిసికట్టుగా పనిచేసి గెలుపునకు కృషి చేద్దామని ఆ పార్టీ వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకర రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం రెడ్డి సంతపేటలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలో, వార్డులో గ్రూపు రాజకీయాలకు తావు లేదని, అందరినీ కలుపుకుని పోవాలని హితవు పలికారు. ఉన్నదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్గమేనన్నారు. వీరంతా భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కనుసన్నల్లో ఉత్సాహంగా పనిచేయాలన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ చేట్ల ఎల్లయ్యరెడ్డి, నందిక శ్రీనివాసరెడ్డి, ఉప్పాడ అప్పలరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, పట్నాల రాము, చేట్ల నరసింగరావు, నందిక రమణ, చిల్ల ప్రమీల, చేట్ల అప్పలసూరమ్మ తదితరులు మాట్లాడారు.

శ్రీసాయి శ్రీనివాస కల్చరల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు స్వతంత్రనగర్‌లో ఆదివారం శ్రీ సాయి శ్రీనివాస కల్చరల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటయ్యింది. నంది అవార్డు గ్రహీత బీవీఎస్ పాత్రో నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ కమిటీ ఏర్పాటు చేశారు. అసోసియేషన్ అధ్యక్షునిగా పి.సీతారాం, ప్రధాన కార్యదర్శిగా సుబ్రమణ్యం, గౌరవ సలహాదారుగా పాత్రో, కోశాధికారిగా జీఎల్ నాయుడు, ఉపాధ్యక్షుడిగా హరినాథ్‌ను ఎన్నుకున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ అసోసియేషన్ ద్వారా సింహాద్రి అవార్డ్స్ పేరిట పౌరాణిక, సాంఘిక పద్య నాటక పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నట్టు చెప్పారు. ఈ ఏడాది కూడా నవంబర్‌లో వేపగుంటలో పోటీలు నిర్వహించనున్నామని, ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ అవార్డ్స్ కూడా అందించనున్నామని తెలిపారు.

అభాగ్యులకు ఆహార ప్యాకెట్ల పంపిణీ



తగరపువలసలో ఆహార ప్యాకెట్లు అందిస్తున్న ప్రతినిధులు

తగరపువలస: టీచర్స్ హెల్ప్ గ్రూప్ జనతా మీల్స్ పంపిణీ కార్యక్రమం ఆదివారంతో వంద రోజులు పూర్తి చేసుకుంది. దీంతో భీమిలి రోడ్డులో గ్రూప్ ప్రతినిధులు వంద మంది నిరాశ్రయులకు ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంద రోజులుగా జనతా మీల్స్ పేరుతో రోడ్ల పక్కన ఉంటున్న నిరాశ్రయులకు రోజూ ఆహారం అందించామన్నారు. గ్రూప్ సభ్యులు, దాతల సహకారంతో ఇప్పటి వరకు రూ.2.40 లక్షలు ఖర్చు చేశామన్నారు. కార్యక్రమంలో కె.ముత్యాలరావు, ఎం.అప్పారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



గణపతి (ఫైల్)

ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లి పంచాయతీ వెంకటాపురంలో ఓ వివాహిత అదృశ్యమైనట్టు ఆదివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలిలా ఉన్నాయి. వెంకటాపురం గ్రామానికి చెందిన గణపతి (24)కి విజయనగరం జిల్లా, దత్తిరాజేరు మండలం, పెదకాద గ్రామానికి చెందిన దనాల రాముతో రెండేళ్ల క్రితం వివాహమైంది. ఆమె ప్రస్తుతం ఐదో నెల గర్భవతి. ఇదిలా ఉండగా ఈ నెల 19న గణపతి భర్త రాము ఆనందపురం మార్కెట్‌కు మామిడిపండ్లు అమ్మకానికి తెచ్చాడు. మామిడి పండ్లు అమ్మగా వచ్చిన డబ్బులలో కొంత ఇమ్మని భర్తను గణపతి అడగడంతో వాగ్వాదం జరిగింది. అనంతరం రాము తన ఇంటికి వెళ్లిపోయాడు. కాగా వెంకటాపురంలో తల్లిదండ్రుల వద్ద ఉంటున్న గణపతి ఈ నెల 20న సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లి పోయింది.

ఈ మేరకు కుటుంబ సభ్యులు అన్ని ప్రాంతాల్లో వెతికినా ఎక్కడా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ పైడిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాలిథిన్ వినియోగంపై విస్తృతంగా తనిఖీలు



ప్రైవేట్ మార్కెట్‌లో పాడైపోయిన పంది మాంసం స్వాధీనం చేసుకుంటున్న శానిటేషన్ సిబ్బంది



పాన్‌షాపు నుంచి స్వాధీనం చేసుకుంటున్న పాలిథిన్ సంచులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జెడ్సీ బి.రాము, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మినాయుడు, జీవీఎంసీ టాస్క్‌ఫోర్స్ టీమ్‌కు చెందిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రైవేట్ మార్కెట్, మెయిన్‌రోడ్డు దుకాణాల్లో పాలిథిన్ కవర్ల కోసం వేర్వేరుగా విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో పలువురు వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున కవర్లు స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. ఈ సందర్భంగా జెడ్సీ రాము మాట్లాడుతూ పాలిథిన్ వినియోగం పర్యావరణానికి ప్రమాదకరమని పలు మార్లు ప్రచారం చేసినా వ్యాపారుల్లో మార్పు కనిపించడం లేదన్నారు. మళ్లీ మళ్లీ పాలిథిన్ సంచులతో పట్టుబడితే వ్యాపారుల ట్రేడ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

తనిఖీల్లో విస్తుగొలిపే విషయాలు

పాలిథిన్ సంచుల కోసం దుకాణాల్లో తనిఖీలు చేపట్టిన జీవీఎంసీ సిబ్బందికి విస్తుపోయే విషయాలు తెలిశాయి. మెయిన్‌రోడ్డులోని వీఎస్ఆర్ ఫ్రూట్ జ్యూస్ దుకాణంలో కుళ్లిపోయి, పాడైన పండ్లతో జ్యూస్ తయారుచేసి విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఇలాంటి వాటివల్ల వినియోగదారులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ మార్కెట్‌లో విక్రయానికి శుభ్రం చేయకుండా తీసుకొచ్చిన పంది మాంసం స్వాధీనం చేసుకున్నారు. వినియోగదారుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు శుభ్రత చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. తనిఖీల్లో సచివాలయ శానిటరీ కార్యదర్శులు సురేష్, కిరణ్, శివ, మనోజ్, కిషోర్‌ప్రసాద్, పైడిరాజు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



తాళ్లవలసలో కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న జై భీమ్ బహుజన యువసేన



ఆనందపురం జంక్షన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ఆనందపురం : కేంద్ర ప్రభుత్వంతోపాటు, అక్కడి రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే మణిపూర్‌లో ఘోర సంఘటనలు జరుగుతున్నాయని వీవోఏల రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్.రూపాదేవి ఆరోపించారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి చిత్ర హింసలకు గురిచేసిన సంఘటనకు నిరసనగా ఆదివారం ఆనందపురం జంక్షన్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రూపాదేవి మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ లేదని మణిపూర్ సంఘటనలు రుజువు చేస్తున్నాయని చెప్పారు. దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి, అపర్ణ, కుంచమ్మ, శ్రీలక్ష్మి, పార్వతి, సంతోషి కుమారి పాల్గొన్నారు.

తగరపువలస: మణిపూర్‌లో కొంతకాలంగా మారణకాండకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆదివారం సాయంత్రం భీమిలి మండలం తాళ్లవలసలో జై భీమ్ బహుజన యువసేన డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు. సభ్య సమాజం తల దించుకునేలా మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించిన మూర్ఖులను బహిరంగంగా ఉరి తీయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సలహాదారుడు బోని ఈశ్వర్‌కుమార్, బోని నరసింగరావు, పైడితల్లి, కాటా సన్యాసిరావు, శిరిగిడి అప్పలరాజు, రవ్వ రాంబాబు, బోని ఆదిరాజు, మట్టా ఆదినారాయణ, రాంబాబు, రమణ, గిరీష్ పాల్గొన్నారు.

ఈ శ్రమ బీమాలో 500 మంది వివరాల నమోదు

తగరపువలస: చిట్టివలస వాస్తవ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక లేబర్ వెల్ఫేర్ సెంటర్‌లో ఆదివారం ఈ శ్రమ బీమా కార్డుల నమోదులో 500 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికుల కోసం ప్రవేశపెట్టిన ఈ పథకం గురించి జెడ్సీ బి.రాము, సహాయ కార్మిక శాఖాధికారి ప్రసాదరావు అవగాహన కలిగించారు. సంఘం అధ్యక్షుడు పిట్టా సురేష్, భీమిలి బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్.జనార్ధనరావు, ఆదిమూలం నాగరాజు, దుర్గా శేఖర్ పాల్గొన్నారు.